కథానిక

# జీవన సంధ్య

'గున్రోవ్'

వాన కురుస్తోంది. ఊళ్ళో అలికిడేమీ లేదు. నిశ్శబ్దం నాట్యమాడుతోంది. ఉదయం నుండి సూర్యదర్శనం లేదు. కాలం స్తంభించి నట్టుంది. పెద్ద రైతులు అరుగుల మీద కూర్చుని తాపీగా చుట్టలు చుట్టుకుంటూ, లోకాభి రామాయణంలో మునిగిపోయారు. ఇది ఊళ్ళో ఉన్న పది పెద్ద కొంపలదగ్గర పరిపాటే. వానకూడా ఆ కబుర్లు విందామన్నట్లు పట్టుపట్టి కురుస్తోంది. రామన్నగారి వీధి అరుగుమీద కూర్చున్నారు నలుగురూ. వాళ్ళకి కొంచెం యెడంగా కూర్చున్నాడు రామన్నగారి అల్లుడు-కాళ్ళూపుతూ, వానధోరణి చూస్తూ. కుర్రాళ్ళు వానలో తడుస్తూ పశువుల్ని తోలుకుపోతున్నారు-అర్థంలేని ఆనందం తమ కళ్ళలో మెరుస్తుండగా. వాళ్ళ దెస మూగగా చూస్తున్నాడు అల్లుడు దరహాసనంతో. నెత్తిమీద తట్ట-తట్టలో ఏవో పండ్లు: మామిడిపండ్లు గాబోలున్నాయి. వణకుతూ వచ్చాడు రామన్న గారింటికో ముసలాడు, వానలో తడుస్తూ. దించాడు అరుగుమీద నెత్తిమీద తట్ట కష్టంతో. కబుర్లు చెపుతూన్న రామన్నకాపు "యేంయిరా" అనే పరిచయ వాక్యాలను ఆ ముసలాడి పయికి విసరి "ఒలే బుల్లీ, యివి తీసికెళ్ళి యింటో పెట్టు"—అన్నాడు గట్టిగా. ఇంటోంచి వచ్చిందొక పదేళ్ళపిల్ల. పెట్టిందాపిల్ల తట్టనింట్లోకి తీసికెళ్ళి. ముసలాడు నీళ్ళు పడకుండా ఉండేలాగ అరుగును ఆనుకు వణుకుతూ నిలబడ్డాడు.

"యేంయిరా. అక్కడంతా బాగున్నారా?" అన్నాడు రామన్నకాపు ఆగుంపులోంచి ముసలాడి వైపు చూడకుండానే.

"సిత్తంబాబూ" అన్నాడా ముసలాడు అమిత వినయంగా చేతులు నలుపుతూ.

రామన్నగారింక సంభాషణ ముగించి తమ ధోరణిలో పడ్డారు. ముసలాడలాగే నుంచున్నాడు వానలో తడిసిన తలనుండి నీరుపిడుస్తూ. ముసలివాని శరీరం మీద మొలతాడు సాధారంగా జేసుకున్న ఒక గోచీతప్ప మరేవిధమయిన ఆచ్ఛాదనా లేదు. శరీరం ముడుతలుపడి చర్మం వ్రేలాడుతోన్నట్లున్నది. ఎముకలగూడు. దారుణమయిన అసహ్యమో లేక అఖండమయిన కరుణో తెలియని ఆవేదన ఆవేశిస్తుంది అలాంటి వాళ్ళని చూస్తే. ఆ బొమికెల గూడునుంచి యెర్రగా మెరుస్తున్న గాజు బంతుల నుంచి అవ్యక్తమయిన అనుభూతి ప్రసరిస్తూవున్న వ్యక్తిని చూస్తున్న రామన్నగారి అల్లుని కేమి తోచిందో చటుక్కున మంచంమీద తిన్నగా కూర్చుని తాతతో ప్రసంగం ఆరంభించాడు.

"ఏ వూరు నీది?"

"ఈ పక్కూరే నండి. బాబుగారి దగ్గర బందుగులే. యీయనగోరి తమ్ముడి కాడనుండి-"

"ఎంతదూరముంటుంది?"

"మూడు కోసు లుంటాదండి."

"అక్కడకూడా వాన కురుస్తోందా?"

"అబ్బె, నేదండి బాబూ. రెండు కోసుల నుండున్నాదండి.

"అలాగా" అన్నాడల్లుడుగారు, యింకే మనడానికీ తోచక.

ముసలాడు సైతం మౌనం వహించాడు. రామన్నగారి ముఠాకూడా సంభాషణ ఆపు చేశారు. వానమాత్రం తనపని తాను పట్టుదలగా సాగిస్తోంది. ఒక్క గాలితెర అతి శీతలంగా శరీరాన్ని గుచ్చుకుంటూ వీచింది. అంతా తమ బట్టలు దగ్గరగా లాక్కున్నారు. ముసలాడు వణకుతూ అరుగుకి అతుక్కుపోయాడు.

"అయితే నీ కెన్నేళ్లుంటాయి?" అన్నాడాయన నిశ్శబ్దం విదలిస్తూ.

"నాకా బాబూ - డబ్బయి దాటాయి" అన్నాడు కళ్ళలోంచి నిరాశగకుక్కుతూ.

"ఇంత ముసలాడివి యింకా యీ పనేటి సెప్పు-పాపం-నీకు."

"కడుపు గడొద్దూ!"

"మరి నీకు కొడుకుల్లేరా?"

'యెదిగి తెచ్చే కొడుకుని పంపినాను బాబూ" అన్నాడు ముసలాడు దీనంగా తలూపుతూ.

"ఇంకెవరూ నేరా?"

"ఉన్నా డింకోడు. ఆడు తెచ్చేదాంతో యెడతాదా బాబూ యీ కాటకం రోజుల్లో! యాడో నానూ కూంత సంపాయిస్తే సోలెడుగంజి తాగొచ్చు, ఆడు తెత్తాది ఓడికీ సానదూ."

"ఏం. ఆడు సరీగా పనిసెయ్యడా?"

"సేయకేం, సచ్చిచెడి చేత్తాడు. చేత్తేమా త్తరం బాబూ, ఆడికి సరిపడ యిత్తారు గాని యింట్లో ఆళ్ళందరికీ యిత్తారా?"

"రోజూ పని చేత్తావా యిలాగ?"

"ఏదో రోజూ సేత్తోనేవుంటా సిన్న సిన్న పనులు తమనాటి పటువుల కాడ."

"సెయ్యడానికి శక్తుందా, యింకా నీకు?"

"సూసినారా బాబూ - యీ సేత్తో" అని తన పుల్లలాంటి ఎముకల చేతిని చూపాడు - ఒకసారి ఆప్యాయంగా, గర్వంగా తన చేతివైపు చూసికొని.

"ఈ సేత్తో దున్నా; మారాజులు ఆరి భూమి, యేళ్ళె యేళ్ళు. ఈ సేతిమీదుగానే పండించా బత్తాలు బత్తాలు దాన్నెం నెక్కలేకుండా. ఆ మారాజులు అనాగే చూసినారు. సేతికి ఎముకుందా ఆరికి! మూడేనుములు దాన్నెం ఆర్నెల్లకు యిచ్చేవారు. ఈ నాటికి కూడా యేదో సిన్నదో పెద్దదో పని సెప్పి ముట్టసెప్తారు. మా బాబులు" అన్నాడు - అల్లుడు మాట్లాడక పోవడం గమనించి కొంచెం ఉత్సాహంగా. మళ్ళీ వెంటనే ముసలాడి ముఖంలో దుఃఖరేఖలు అలముకొన్నాయి. వాడు అతి జాలిగా ఆకాశంలోకి ఒక నిమిషం చూసి, తల కిందికి దించి, నెమ్మదిగా ప్రారంభించాడు, వణకే కంఠంతో.

"ఏటో బాబూ, యీ యెదవబతుకు-అంత కుర్రోణ్ణి పోట్ట నెట్టుకు నింకా బతకడం. ఏటీ కట్టాలు- అంతూనేదు; నా యీడుకి యింకా సావునేదు. సావంటే బయమేసీదిగాని యిప్పుడు నేదు బాబు-"రామన్నగారల్లుడు మౌనం వహించాడు. కాలూపుతూ కూర్చున్నాడు. ముసలాడు గొణుక్కుంటూనా్నడేదో పైకి తెలియకుండా. లోపలనుంచి రామన్నగారమ్మాయి కొన్ని నూకలు, పండ్లబుట్ట తీసికొచ్చి యిచ్చింది. ముసలాడు ఆశగా వానివేపు చూసి సంతృప్తిని సూచించే చిరునవ్వుతో అల్లుడు నుద్దేశించి "బాబూ - తమరు యేదన్నా పాతగుడ్డ ముక్కిప్పించాల, చలితో చత్తున్నా' అన్నాడు. అల్లు డేకళ నున్నాడోగాని వెంటనేలేచి లోపలికి పోయి చిరిగిన పంచె ఒకటి తెచ్చి యిచ్చాడు. ముసలాడు ఆనందాతిరేకంచేత మాట్లాడలేక తన కృతజ్ఞత కళ్ళద్వారా అర్పించాడు. అక్కడున్న అమ్మాయిని కాస్త నంజుకు పెట్టమని సైగచేశాడు. ఆమె పోయి యేదో ఒక ఆకులో తెచ్చి యిచ్చింది. వాడు, అటూయిటూ ఒకసారి చూసి దాంట్లో సగం అక్కడే నోట్లో వేసుకుని, మిగతాది చాలా జాగ్రత్తగా ఆపంచె కొకపక్క ముడివేసి రెండవకొన నూకలు మూటకట్టుకుని, అల్లుడు గారికి నమస్కార మర్పించి మూట తలమీద పెట్టి తట్ట బోర్లించి, ఆ వానలో తన దారిని పోయాడు.

